ప్రజాశక్తి

ఆదివారం 8 డిసెంబర్ 2024 5 అనంతపురం

లక్ష్యానికి దూరంగా రిజిస్ట్రేషన్లు

- ఇప్పటికి 64.50 శాతమే...
- నిరాశాజనకంగా రియల్ఎస్టేట్ వ్యాపారం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భూముల రిజిస్ట్రేషన్లు నత్తనడకన సాగుతున్నాయి. వార్షిక లక్ష్యానికి దూరంగా రిజిస్ట్రేషన్ల ఆదాయముంటోంది. గత కొన్ని రోజులుగా రియల్ఎస్టేట్ వ్యాపారం నిరాశజనకంగా ఉంటోంది. ఆ వ్యాపారంపై ఆధారపడిన వ్యాపారులు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. ముందులాగా అమ్మకాలు, కొనుగోళ్లు సాగడం లేదని చెబుతున్నారు. రియల్ వ్యాపారం మందకొడిగా ఉంటోందంటున్నారు. అందుకు తగ్గట్టుగానే రిజిస్ట్రేషన్ల ఆదాయంలోనూ ఇది స్పష్టంగా కనిపిస్తోంది. రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వం ఊహించినంతగా ఆదాయం రావడం లేదు. నత్తనడకన రిజిస్ట్రేషన్లు సాగుతున్నారు. అనంతపురం జిల్లాలో ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు చూస్తే లక్ష్యంలో 64.50 శాతమే చేరుకోవడం జరిగింది.

అనంతపురం జిల్లాలో మొత్తం 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి వార్షిక లక్ష్యం రూ.469.65 కోట్లు ఉంది. అందులో నవంబర్ వరకు చూస్తే రూ.300.57 కోట్లు రావాల్సి ఉంది. ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం చూస్తే రూ.193.86 కోట్లు మాత్రమే. అంటే నవంబర్ వరకు రావాల్సిన ఆదాయంలో 64.50 శాతమే వచ్చింది. అదే వార్షిక లక్ష్యంతో పోల్చి చూసినప్పుడు 41.27 శాతమే ఆదాయం సమకూరింది. వచ్చే నాలుగు మాసాల్లో 59 శాతానికిపైగా ఆదాయం ప్రభుత్వానికి సమకూరాల్సి ఉంది.

కణేకల్ ప్రథమం- తాడిపత్రి అథమం..

అనంతపురం జిల్లాలో 12 రిజిస్ట్రేషన్ శాఖల పరిధిలో చూసినప్పుడు లక్ష్యానికి చేకూరే విషయంలో కణేకల్ కొంత మెరుగ్గా ఉండగా తాడిపత్రి చివరి స్థానంలో ఉంది. కణేకల్లో నవంబర్ వరకు లక్ష్యం రూ.7.37 కోట్లకుగానూ రూ.5.70 కోట్లు ఆదాయం సమకూరింది. ఆ తరువాతి స్థానం ఉరవకొండ ఇక్కడ రూ.10.21 కోట్లకుగానూ రూ.7.89 కోట్ల ఆదాయం సమకూరింది. లక్ష్యంలో 77.31 శాతం చేరింది. అనంతపురం రూరల్ లక్ష్యం రూ.54.51 కోట్లకుగానూ రూ.40.63 కోట్లు ఆదాయం సమకూరింది. అంటే 74 శాతం లక్ష్యం చేరింది. అనంతపురం నగరంలో రూ.101.66 కోట్లకుగానూ రూ.64.44 కోట్లు ఆదాయం వచ్చింది. 63 శాతం లక్ష్యం చేరింది. గుత్తి రూ.13.89 కోట్లకుగానూ రూ.9.50 కోట్లు, 68.42 శాతం, శింగనమల రూ.8.52 కోట్లకుగానూ రూ.5.45 కోట్లు, రాయదర్గం రూ15.42 కోట్లకుగానూ రూ.116.6 కోట్లు, 75.61 శాతం, గుంతకల్లు రూ21.52 కోట్లకుగానూ రూ.13.30 కోట్లు, 61.77 శాతం, యాడికి రూ.4.95 కోట్లకుగానూ రూ.2.75 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. అంటే లక్ష్యంలో 55 శాతమే వచ్చింది. పామిడిలో రూ.10.24 కోట్లకుగానూ రూ5.34 కోట్లు 52.16 శాతం లక్ష్యం చేరుకుంది. ఇక అన్నింటికంటే తాడిపత్రి అతి తక్కవ ఆదాయం సమకూరిన దాంట్లో ఉంది. ఇక్కడ లక్ష్యం రూ.37.12 కోట్లకుగానూ రూ.18.28 కోట్లు మాత్రమే ఆదాయం సమకూరింది. లక్ష్యంలో 49 శాతమే చేరుకుంది.

'పాఠశాలల్లో పండుగ'

కూడేరులో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో పాల్గొన్న తల్లిదండ్రులు

కూడేరులో ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లి దండ్రులు

పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ సందర్భంగా నృత్యం చేస్తున్న విద్యార్థిని

కూడేరులో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్

- ఉత్సాహభరితంగా పేరెంట్స్, టీచర్స్ మెగా మీటింగ్
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు
- పాఠశాలల్లో తల్లిదండ్రులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పాఠశాలలో సమావేశం అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్సాహభరితంగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను నిర్వహించేలా కొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులు చదువులు, మౌలిక వసతులు తదితర వాటిని చర్చించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో అధికారులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి వారి నుంచి సూచనలు తీసుకున్నారు. అక్కడి సమస్యలను పరిష్కరించేందుకు ఉమ్మడి కార్యచరణను చేపట్టారు. ఇదే సమయంలో తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి ఉత్సాహపరిచారు.

రాయదుర్గం జిల్లా పరిషత్ పాఠశాలలో తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశమంలో ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన తల్లిదండ్రులకు విప్ బహుమతులు అందజేశారు. కూడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశమంలో కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ పాల్గొన్నారు. అనంతలో చదివిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో నిలవాలంటూ కలెక్టర్ పిలుపునిచ్చారు. పిల్లల మొబైల్ వాడకుండా తల్లితండ్రులు నిఘా ఉంచి నియంత్రించేలా చూడాలని కోరారు. పుస్తకపఠనం, వ్యాయామం, క్రీడలు, కళలపై మక్కువ పెంచాలని కలెక్టర్ తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల ఆలోచన విధానం కూడా చాలా గొప్పగా ఉండాలని, తద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రణాళికలు పాఠశాల స్థాయి నుంచే వేసుకోవాలన్నారు.

పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ఆర్ఒప్లాంట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. రాప్తాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. అనంతపురం నగరం రాజేంద్రనగర్ పాఠశాలలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ పాల్గొన్నారు. పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ బడులు మార బోతున్నాయంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం రూ.50వేల విరాళం అందించారు. బుక్కరాయసముద్రం మండలం జెడ్పీ ఉన్నత పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యాక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమన్వయ నిర్ణయాలతో పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతపురం సమీపంలోని కురుకుంట బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ జగదీష్ పాల్గొన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలంటూ ఆయన విద్యార్థులకు సూచించారు.

రాయదుర్గంలో ప్రసంగిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

సిద్ధారాంపురం గ్రామంలో విద్యార్థులకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

అనంతపురం రాజేంద్రనగర్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం తింటున్న ఎమ్మెల్యే ప్రసాద్

లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా ఉంచాలి

ఆర్‌డిఒ వసంత్‌బాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ వసంత్‌బాబు

లింగ నిర్ధారణ పరీక్షలపై వైద్యాధికారులు నిఘా ఉంచాలని ఆర్‌డిఒ వసంత్‌బాబు సూచించారు. శనివారం కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతోందన్నారు. ఇందుకు ప్రధాన కారణం భ్రూణహత్యలకు పాల్పడటమే అన్నారు. ఎవరైనా భ్రూణ హత్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ, జోనల్ డాక్టర్ రాజేష్, ఎన్‌జిఒ అధ్యక్షులు మాధవ, హెల్త్‌అసిస్టెంట్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి పైప్‌లైన్ లీకేజీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం పట్టణ శివారులోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పంప్‌హౌస్ వద్ద ప్రధాన పైప్‌లైన్ లీకేజీ ఏర్పడింది. దీంతో నీరు వృథా పోతోంది. తాగునీటి పైప్‌లైన్ లీకేజీ ఏర్పడినట్లు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పైప్‌లైన్ పగిలి ఎగిసిపడుతున్న నీరు

సాయుధ పతాక నిధికి విరాళాల సేకరణ

ర్యాలీ సందర్భంగా అనంత టవర్ క్లాక్ వద్ద ఎన్‌సిసి విద్యార్థులు, సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది ప్రదర్శన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలు, దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో అహర్నిశలూ విధులు నిర్వహిస్తున్న సైనికులు, మాజీ సైనికుల సంక్షేమానికోసం సాయుధ దళాల పతాక నిధికి అన్ని వర్గాల ప్రజలు ఉదారంగా విరాళాలు అందించాలని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్లు డా॥వి.వినోద్ కుమార్, టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సాయిధ దళాల పతాక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సైనిక సంక్షేమ శాఖ రూపొందించిన స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్ , కరపత్రాలను అన్ని వర్గాల ప్రజలు, అధికారులు, ఉద్యోగులు, దాతలకు సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, మాజీ సైనికులు అందించారు. వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలతో హుండీ బాక్సల ద్వారా సాయుధ దళాల పతాక నిధికి విరాళాలను సేకరించారు. అన్ని వర్గాల ప్రజలు విరాళాలను జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఎస్‌బిఐ ఖాతా నెం:62076956433 ఐఎఫ్‌ఎస్‌సి కోడ్: SBIN 0021438 ద్వారా కూడా విరాళాలను అందించవచ్చని రెండు జిల్లాల కలెక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప, మాజీ సైనికుల సంఘం నాయకులు కెప్టెన్ షేకన్న, విశ్వేశ్వర రావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, కళాశాల ఎన్‌సిసి అధికారులు రామాంజనేయులు, వెంకమ్మ, జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయం సిబ్బంది గిరీష్, బాబా ఫక్రుద్దీన్, అమర్ నాథ్, అనిల్, డీపీఆర్‌వో గురుస్వామి శెట్టి పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఎంపీ అంబికా భేటీ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలిసి రాష్ట్రంలో విపత్తు నిర్వహణ మెనేజ్‌మెంట్, విపత్తుల సమయంలో చేపట్టిన సహాయక చర్యలు, నష్టపరిహారంపై అమిత్‌షాతో చర్చించారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో మాట్లాడుతున్న ఎంపీలు తెన్నేటి, అంబికా

కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అపరిష్కృత సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

కార్పొరేషన్ పరిధిలో ఉన్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలూ తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రెగ్యులర్ కార్మికులకు యూనిఫాం, కొబ్బరి నూనె తదితర వస్తువులను మేయర్ మహమ్మద్ సలీం, కమిషనర్ నాగరాజు, కార్పొరేటర్లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి తాము ప్రభుత్వం ద్వారా అన్ని చర్యలూ తీసుకుంటామని తెలియజేశారు. సమస్యల పరిష్కారం పేరుతో నిరసనలు చేయొద్దని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ దీర్ఘకాలింగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చామని అయినా స్పందన రాకపోవడంతోనే విధిలేని పరిస్థితుల్లో ఆందోళన చేస్తున్నామని చెప్పారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తే ఆందోళనలు చేయాల్సిన అవసరం లేదన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెరిగిన నగర జనాభాకు అనుగుణంగా కార్మికుల పెంపు, సరెండర్ లీవు బకాయిలు తదితర అనేక సమస్యలు ఉన్నాయని వీటన్నింటినీ అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, జిల్లా కోశాధికారి ఆదినారాయణ, నగర, అధ్యక్ష కార్యదర్శులు బండారు ఎర్రిస్వామి, తిరుమలేష్, శేషేంద్ర కుమార్, లక్ష్మీ నరసమ్మ, రెగ్యులర్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ముత్తు రాజు, నల్లప్ప పాల్గొన్నారు.

భోజనం సరిగ్గా లేదని ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉడికీ ఉడకని అన్నం ఎలా తింటారు..?

మధ్యాహ్నం భోజనంపై తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి-యల్లనూరు

'ఉడికీ ఉడకని భోజనాన్ని విద్యార్థులు ఎలా తింటారు.. మా పిల్లలకు రోజూ ఇలాగే పెడుతున్నారా..? అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉడికీ ఉడకని మధ్యాహ్న భోజనాన్ని వడ్డించడం గమణించి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇలాంటి ఉడకని భోజనం ఎలా పెడుతున్నారని ప్రధానోపాధ్యాయులు రత్నమ్మ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలోనే ఉపాధ్యాయులకు చెప్పినా భోజనంలో మార్పు రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. పిల్లలకు రోజూ ఇలాంటి భోజనం పెడితే ఎలా తింటారని నిలదీశారు. ఆఖరికి తాము ఇళ్ల నుంచి క్యారియర్ తీసుకొస్తామని విద్యార్థులు చెబుతున్నా వినకుండా మధ్యాహ్నం పాఠశాలకు గేట్లు వేస్తున్నారని తెలిపారు. ఒకానొక దశలో ఇదే భోజనం మీరు కూడా తినాలని పట్టుబట్టారు. ఈ విషయంపై ఎంఇఒను ప్రజాశక్తి వివరణ కోరగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. త్వరలోనే భోజనాన్ని తనిఖీ చేసి ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పెన్నహోబిలంలో వసతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని పెన్నోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, జిల్లా నాయకులు ముషూరు వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి కోరారు. ఈమేరకు శనివారం స్థానిక ఆలయంలో ఇఒ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటోందన్నారు. కావున భక్తులకు మంచినీరు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని, జలాశయం వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, విశాలమైన పార్కు, నిత్యాన్నదానం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే వేలంపాట నిబంధనల ప్రకారం టెంకాయలు అమ్మేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుక ఇఒ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

రైతు సమస్యలపై 13 నుంచి పోరుబాట

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

రైతుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఈనెల 13వతేదీ నిరసన తెలపనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారన్నారు. పండిన కొద్దిపాటి పంటలకు కూడా గిట్టుబాటు ధర అందడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారులు, దళారులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారన్నారు. వరి, మొక్కజొన్న, వేరుశనగ, పత్తి ఇతరత్రా పంటలకు మద్దతు ధర ప్రకటించినా అందుకు అనుగుణంగా అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. గతేడాది వరిధాన్యం క్వింటా ధర రూ.2700 నుంచి రూ.2800 ఉంటే ఇప్పుడు రూ.1700 వరకూ మాత్రమే పలుకుతోందన్నారు. వైసీపీ హయాంలో కిసాన్ రైలు 50 శాతం సబ్సిడీతో వస్తే ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. జిల్లాలో కిసాన్ రైలును పునరుద్ధరించాలన్నారు. జిల్లాలో పండ్ల తోటలు అధికంగా ఉన్న నేపథ్యంలో గిట్టుబాటు ధరతో పాటు మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కిసాన్ ఉడాన్ కింద వినామాల ద్వారా సరుకు తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాన్నారు. సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, హెచ్ఎల్‌సీ ఆధునీకరణ చేయాలని కోరారు. ఈనేపథ్యంలో రైతాంగం తరుపున నిరసన తెలిపేందుకు వైసిపి అధినేత జగన్ కార్యాచరణ ప్రకటించారన్నారు. ఇందులో భాగంగా ఈనెల 13న అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా బయలుదేరి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వైసిపి సమన్వయకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టి నాయకులు, కార్యకర్తలు, రైతులను భాగస్వామ్యం చేసుకుని తరలిరావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం

మెగా తల్లిదండ్రుల సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

భావిభారత పౌరులైన విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని సిద్ధరాంపురం ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్-టీచర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు టీచర్లు విద్యను బోధించి, విద్యాబుద్ధులు నేర్పిస్తారన్నారు. అయితే పిల్లలు సమాజం పట్ల క్రమశిక్షణతో మెలిగేందుకు తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కాట్టప్పగారి రామలింగారెడ్డి, పసుపుల శ్రీరామిరెడ్డి, పసుపుల హనుమంతురెడ్డి, తహశీల్దార్ పుణ్యవతి, ఎంపిడిఒ సొలమన్‌రాజ్, ఎంఇఒ లింగానాయక్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : విద్యార్థులు సమాజ సేవకులుగా తీర్చిదిద్దాలని ఆర్‌డిఒ వసంతబాబు సూచించారు. శనివారం స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెగా విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని గుర్తు చేశారు. మధ్యాహ్న భోజన పథకంతోపాటు ఏకరూప దుస్తులు, పుస్తకాలు, వసతిగృహాలు కల్పిస్తూ పాఠశాలలో వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : తల్లిదండ్రులు ప్రోత్సహిస్తేనే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని తహశీల్దార్ ఈశ్వరమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చంద్రానాయక్, స్కూల్ ప్రిన్సిపాల్ సాకే సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నార్పల : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల మెగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ఛైర్మన్ నాగరత్నమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతోమంది విద్యార్థులు నేడు ఉన్నత స్థానాలను అధిరోహించారన్నారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో బాగా చదువుకుంటే మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం ఆటలపోటీలతోపాటు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ గంగావతి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, నగేష్, సంగీతకుమారి, నిర్మల, వెంకటరెడ్డి, టిడిపి నాయకులు మహేష్‌నాయుడు, సలేహ, ఇస్మాయిల్, శివ, పవన్‌కుమార్, నాయుడు, రామాంజనేయులు, పాఠశాలల కమిటీ ఛైర్మన్‌లు ప్రసాద్, ప్రకాష్, రవికుమార్ పాల్గొన్నారు.

శింగనమల : మండలవ్యాప్తంగా విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల్లో వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సోదనపల్లి జడ్పిహెచ్‌ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులతో తల్లిదండ్రులను భాగస్వాములను చేయడం సంతోషకరమన్నారు. ఇలాంటి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆలోచనలను తల్లిదండ్రులతో పంచుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ నాగవేణి, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, వివేకానంద, బైపరెడ్డి, రాజేష్, పరిమళాదేవి, రుక్మిణీదేవి, రజిని, రాజేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నార్పలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పుట్లూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల్లో వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో తహశీల్దార్ శేషారెడ్డి, ఎస్ఐ హేమాద్రి, నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయులు, టీచర్లు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ శివబాలరాజు, ఎంఇఒలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాప్తాడు : మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరై మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఇందులో భాగంగానే తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమాల్లో సిఐ టి.హర్ష, తహశీల్దార్ విజయ్‌కుమారి, ఎంపిడిఒ బుల్లే విజయలక్ష్మి, ఎంఇఒ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు సాంబశివుడు, ప్రధానోపాధ్యాయురాలు లీలావతి, ఉపాధ్యాయులు నల్లప్ప, రిసోర్స్‌పర్సన్ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారి డి.తిప్పేస్వామి, విద్యాధికారి మల్లికార్జున, ఐఒఆర్‌డి దేవదాస్, కస్తూరిబా గురుకుల పాఠశాల ఎస్ఒ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ లక్ష్మీనరసింహ, తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎంఇఒలు నరసింహారెడ్డి, రామాంజనేయులు, టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, శశాంక్‌బాబు, విద్యా కమిటీ ఛైర్మన్ బొమ్మయ్య, ఓబుళపతి పాల్గొన్నారు.

యల్లనూరు : మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ముఖ్యంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారి రఘునాథ్‌రెడ్డి, తహశీల్దార్ రాజా, ఎంఇఒ పరమేశ్వరరెడి, సిఐ సత్యబాబు, ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంయుక్తంగా కృషి చేయాలని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి సూచించారు. శనివారం నగరంలోని శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారద, గంగోత్రి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే అనంతపురంలోని ప్రభుత్వ పాఠశాల-2లో శనివారం మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపి పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, కార్పొరేటర్ లక్ష్మీదేవి, ప్రధానోపాధ్యాయులు గురుప్రసాద్, రామకృష్ణ, ఎస్ఐ జయరామిరెడ్డి, పాఠశాల కమిటీ ఉపాధ్యక్షులు దాదాఖలందర్, ఎఎన్ఎం ధనలక్ష్మి, మహిళా పోలీస్ శశికళ, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, నూరుద్దీన్, పూర్వ విద్యార్థి నరసింహులు, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పట్టుదలతో ప్రయత్నిస్తే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చని పాఠశాలల తల్లిదండ్రుల కమిటీల అధ్యక్షులు అన్నారు. శనివారం ఉరవకొండ, విడపనకల్ మండల పరిధిలోని హావలిగి, వజ్రకరూరు మండల పరిధిలోని ప్యాపిలి కొత్తకోట గ్రామాలతోపాటు మండలాల వ్యాప్తంగా తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వజ్రకరూరు మండల విద్యాశాఖ అధికారి ఎర్రిస్వామి, ఎంపిపిఎస్ పాఠశాల కమిటీ ఛైర్మన్ వై.లక్ష్మీనారాయణ, వైస్‌ఛైర్మన్ నాగేంద్ర, టిడిపి నాయకులు నాగన్న, రజాక్, చౌదరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

బెలుగుప్ప : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి సి.పెద్దన్న, తహశీల్దార్ సి.షర్మిల, ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ, ఎంఇఒ పి.మల్లారెడ్డి, ఎస్ఓ నాగరత్నబాయి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్, నాయకులు మల్లికార్జున, రుద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : విద్యాశాఖ ఆదేశాల మేరకు శనివారం మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక టిసి ఉన్నత పాఠశాల, ఆదర్శ, జడ్పీహెచ్‌ఎస్, కస్తూరిబా, ఎద్దులపల్లి, ఖాదర్‌పేట, 5వ వార్డు పాఠశాలల్లోను మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌ను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమంల్లో టిసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ హరిత, టిడిపి మండల సమన్వయకర్త ఆర్‌ఆర్.రమేష్, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, కార్యదర్శి పట్టా శ్రీనివాసులు, పూర్వ విద్యార్థులు మహమ్మద్ షఫీ, రఘునాథ్ క్లాత్ స్టోర్, ఎక్స్ ఆర్మీ లక్ష్మీనారాయణ, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండల పరిధిలోని కస్తూరిబా పాఠశాలలో ఎస్ఓ షబానా బేగం ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సమావేశంలో సిఐ వెంకటరమణ, ఎస్ఐ ఈశ్వరయ్య, ప్రిన్సిపాల్ షబానాబేగం, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిటిపి చిన్నకృష్ణ, స్కూల్ కమిటీ ఛైర్మన్ మహాలక్ష్మి, పగాకుల వెంకటరెడ్డి, బెస్త మూర్తి, శివ, రవిచంద్ర, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : మండల వ్యాప్తంగా తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకట శివుడుయాదవ్, మండలంలోని సేవాఘడ్‌లో ఉన్న ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలలో ఎంపిపి జి.విశాలాక్షి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, సోదరుడు గుమ్మనూరు నారాయణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో టిడిపి నాయకులు గుమ్మనూరు ఈశ్వర్, గుమ్మనూరు నారాయణ, పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రజాపురం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యా కమిటీ ఛైర్మన్ వై.వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో విద్యా కమిటీ ఛైర్మన్ వి.నాగరాజు, వైస్‌ఛైర్మన్ లక్ష్మి, ప్రిన్సిపాల్ ఎం.రుద్రాక్షి, బాలికా సంరక్షణ అధికారిణి వాణిదేవి, ఎపి ఆదర్శ పాఠశాలలో విద్యా కమిటీ ఛైర్మన్ పవన్‌యాదవ్, ప్రిన్సిపాల్ ఎస్.ఉషా, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో విద్యార్థులు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు వితరణ

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని కొత్తూరులో ఉన్న స్వీట్ సేవియర్స్ ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన వృద్ధ, అనాథాశ్రమానికి శనివారం నిత్యావసర వస్తువులను వితరణ చేశారు. పట్టణంలోని కైలాస్ ట్రేడర్స్ యజమాని డిఆర్.రాజేంద్ర రూ.6వేలు విలువజేసే బియ్యం, బేడలు, వంటనూనె, తదితర వస్తువులను ఆశ్రమం నిర్వాహకులు సునీత, జగన్నాథ్‌కు అందజేశారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు సి.విజయభాస్కర్, పేట బసవేశ్వర ఆలయ ధర్మకర్త శివకుమార్ పాల్గొన్నారు.

వికలాంగుల దినోత్సవం

ఉరవకొండ : ఆర్డీటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల స్థాయి వికలాంగులందరూ కలిసి పట్టణంలోని ఆర్డీటీ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ వికలాంగులందరినీ అక్కున చేర్చుకుని అన్నివిధాలుగా ఆదుకుంటోందన్నారు. ఇందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజనుల హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గోపాల్, లత్తవరం చంద్రశేఖర్, వెలుగొండ నాగరాజు, ఆర్డీటీ జిఒ శ్రీరాములు, వికలాంగుల మండల ప్రెసిడెంట్ రాము, వైస్ ప్రెసిడెంట్ అంజినప్ప, ఫక్రుద్దీన్, షేక్షానుపల్లి, చంద్రమౌళినాయక్, వికలాంగులు, ఆర్డీటీ కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వైవిఆర్‌ను కలిసిన నాయకులు

గుత్తి : గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని కొత్తపేట గ్రామానికి చెందిన వైసిపి నాయకులు శనివారం కలిశారు. వైవిఆర్ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని హైదరాబాదులోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైసిపి బీసీ విభాగం మండల అధ్యక్షుడు ఎస్.రాము యాదవ్, నాయకులు ఎస్.సుధాకర్ యాదవ్, వెంకటరాముడు, భాస్కర్ అక్కడికి వెళ్లి ఆయనను కలిశారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఎస్‌కెయు ఎంబిఎ హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఎంబిఎ చిత్రావతి వసతి గృహాన్ని రిజిస్ట్రార్ రమేష్‌బాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆహారం నాణ్యత, పరిశుభ్రతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అంతేగాకుండా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ వార్డెన్ కృష్ణుడు ఉన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులు సంజీవులుకు నివాళి

అనంతపురం కలెక్టరేట్ : స్వాతంత్ర్య సమరయోధులు పూలకుంట సంజీవులు వర్ధంతిని పురస్కరించుకుని శనివారం నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జా ఫర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీరాములు, జి.గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యు లు సి.లింగమయ్య, మల్లికార్జున, రమణయ్య, ఎఐవైఎఫ్ నాయకులు జి.సంతోష్ కుమార్, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నప్పయాదవ్ పాల్గొన్నారు.

మాల తిమ్మారాజు మృతి తీరనిలోటు

ప్రజాశక్తి-ఉరవకొండ

అనేక ఏళ్లుగా దళిత ఉద్యమాలకు ఊపిరిపోసిన మాల దాసరి తిమ్మరాజు మృతి తీరనిలోటు అని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి అన్నారు. శనివారం వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చేరుకుని తిమ్మరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మరాజు చిన్నతనం నుంచే దళితుల్లో సామాజిక చైతన్యం తీసుకురావడానికి ఎనలేని కృషి చేశారన్నారు. అలాగే మాల మహానాడు గౌరవాధ్యక్షులుగా దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలు, అత్యాచార దాడులపై గళం విప్పి పోరాడారన్నారు. అలాంటి ఆయన మృతి ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. నివాళులర్పించిన వారిలో జెఎసి నాయకులు, చాబాల సర్పంచి మల్లెల జగదీష్, బండారు సురేష్‌బాబు, దాసరి రామాంజనేయులు, గుమ్మనూరు నాగరాజు, ధనుంజయ, తిరుమలేష్, నాగరాజు, తదితరులు ఉన్నారు.

బిఆర్ స్పందనకు డాక్టరేట్

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో మేనేజ్‌మెంట్ ఆచార్యులు బి.అనిత పర్యవేక్షణలో ఇంపాక్ట్ ఆఫ్ ఎమోషనల్ ఇంటెలిజెన్స్ ఆన్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (విత్ రిఫరెన్స్ టు ఎస్‌బిఐ, కెనరా బ్యాంకు ఇన్ రాయలసీమ రీజియన్) అనే అంశంపై పరిశోధన చేసిన బిఆర్ స్పందనకు ఎస్‌కెయు డాక్టరేట్ ప్రదానం చేసింది. తన పరిశోధన సమయంలో పలు జాతీయ జర్నల్స్‌ను స్పందన ప్రచురించారు. తన ఉన్నతికి కారణమైన గురువు బి. అనితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తల్లితండ్రులు బి.వసంతలక్ష్మి, చిన్నయ్య ప్రోత్సాహంతో విజయవంతంగా పిహెచ్‌డి పూర్తిచేశానని హర్షం వ్యక్తం చేశారు.

పంట కోత ప్రయోగం

పుట్లూరు : మండల పరిధిలోని అరకటవేముల గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంటలో వ్యవసాయ శాఖ అధికారులు శనివారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్ణీత స్థలంలో పంట కోసి ప్రయోగం చేయగా 122 కంకులు వచ్చి 21.5కిలోల దిగుబడి వచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారిణి కాత్యాయిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ హరి, విహెచ్ఎ ఆదినారాయణ, విఆర్ఎ మల్లికార్జున పాల్గొన్నారు.

విజయ్ సాయికుమార్‌కు సేవారత్న అవార్డు

అనంతపురం : అనంతపురం సాయిట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్ సేవారత్న జాతీయ పురస్కారం అందుకున్నారు.అంతర్జాతీయ సామాజిక వేత్తల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో పాన్ ఇండియా కల్చరల్ సోషియో ఆర్గనైజేషన్ రాజమండ్రి వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయసాయికుమార్ అవార్డు అందుకున్నారు.

అవార్డు అందుకుంటున్న విజయసాయికుమార్

CHANGE OF NAME

I, **LAMBE MOHAMMAD SHUAIB** (Old Name) S/o Mohamed Iliyas Lambe R/o H. No. 6-1-56-1, Gondhi Bavi Street, Rayadurg Town-515 865, Anantapuramu District, changing my name from **LAMBE MOHAMMAD SHUAIB** (Old Name) to **LAMBE MOHAMED SHUAIB** (New Name). Henceforth I am being called as LAMBE MOHAMED SHUAIB vide Affidavit dated 27-11-2024 sworn before notary by S. Channaveerappa, NOTARY/ ADVOCATE, Rayadurg.

అయోడిన్ లోపంపై అవగాహన

ప్రజాశక్తి-గార్లదిన్నె

అయోడిన్ లోపం కారణంగా విద్యార్థులకు వచ్చే అనారోగ్య సమస్యలపై ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని ఎర్రగుంట్ల జెడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషక విలువల్లో అయోడిన్ ముఖ్యపాత్ర ఉంటుందన్నారు. అయోడిన్ లోపం ఏర్పడితే థైరాయిడ్ సమస్యలు ఏర్పడతాయన్నారు. అనంతపురం మెడికల్ కళాశాల ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు రోజువారి ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఉండేటట్లు చూసుకోవాలన్నారు. చేపలు, గుడ్డు పాలు వంటివి వారంలో రెండు మూడు రోజులైనా ఆహారంలో తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు కళాజాత ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురుకుమార్, మహమ్మద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

టిడిపి సీనియర్ నాయకులు ఎల్.ఈశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని టిడిపి సీనియర్ నాయకులు ఎల్.ఈశ్వర్‌రెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని సోదనపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థులకు సమయానికి అనుగుణంగా మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. భోజనంలో మార్పులు చేస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం తమకు బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని, రాగి పిండి అంగట్లో తీసుకొచ్చి జావ చేసి ఇస్తున్నామని వంట చేసే వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన ఆయన సంబంధిత డీలర్‌తో మాట్లాడి ప్రతినెలా 1వతేదీనే బియ్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తర్వాత క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అట్టే రామాంజనేయులు, గోపాల్‌రెడ్డి, ఏకిల ఆదినారాయణ, జానగుండ నాగభూషణ, నరసాపురం నరేష్‌నాయుడు, ఈడిగ లక్ష్మయ్య, ఏకిల లక్ష్మయ్య, వడ్డే వెంకటరాముడు, పాఠశాల ఉపాధ్యాయులు సురేష్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, ఆర్.వివేకానంద, బైపరెడ్డి, రాజేష్, పరిమళాదేవి, రుక్మిణీదేవి, రజిని పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఈశ్వర్‌రెడ్డి

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

రాయదుర్గం : పట్టణంలోని బిటిపి రోడ్డు మోడల్ కాలనీ అయోధ్య రామాలయ నిర్మాణానికి విప్ కాలవ శ్రీనివాసులు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు మానవ వికాస కేంద్రాలు అన్నారు. అంతేగాకుండా ప్రతి ఒక్కరూ పరమత సహనాన్ని గౌరవించాలన్నారు. శ్రీరాముడు ఆదర్శ పురుషుడు అని, అలాంటి గొప్ప మానవతావాదికి ఆలయం నిర్మించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళుశిల్ప, వార్డు సభ్యులు శారద, లావణ్య, శ్రీలక్ష్మి, ఆలయ కమిటీ అధ్యక్షులు బంగి ఉమాశంకర్, విహెచ్‌పి అధ్యక్షులు దేవిరెడ్డిపల్లి రాజేష్, ప్రముఖ వైద్యులు ఎ.గోపాల్‌రావు, వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి కిష్టప్ప, ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల తేదీలు మార్పు

పుట్లూరు : మండలంలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల తేదీల్లో మార్పులు చేసినట్లు తహశీల్దార్ శేషారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ నుంచి జనవరి 8వతేదీ వరకూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10న గాండ్లపాడు, 11న ఎస్.గూడూరు, 12న కోమటికుంట్ల, 13,న గరుగుచింతలపల్లి, 17న పుట్లూరు, 18న చాలివేముల, 19న కుమ్మనమల, 20న చెర్లోపల్లి, 21న వెల్లుట్ల, 27న కడవకల్లు, 28న సూరేపల్లి, జనవరి 2న దోసలేడు, 3న చింతకుంట, 4న కందికాపుల, 7న మడుగుపల్లి, 8న చిన్నమల్లేపల్లి రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అన్నదానం

ఉరవకొండ : ఎపి శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామరెడ్డి సమీమణి ఉమాదేవి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో ఉన్న స్వగృహంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. ముందుగా వై.ఉమాదేవమ్మ సమాధికి వద్ద నివాళులర్పించారు. తర్వాత అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, గుంతకల్లు మున్సిపాలిటీ వైస్‌ఛైర్మన్ నైరుతీరెడ్డి, మంత్రాలయం వైసిపి నాయకులు ప్రదీప్‌రెడ్డి, కపిల్ రెడ్డి, శివరామిరెడ్డి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దుర్ఘటనలు..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ఈ వారంలో వరుసగా విషాద దుర్ఘటనలు చోటు చేసుకున్నాయి. రోడ్డు ప్రమాదాల రూపంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. వర్షాలతోనూ ఇళ్లు కూలి ముగ్గురు మృతివాతపడ్డారు. రహదారి ప్రమాదాలు ఈ మధ్య కాలంలో జిల్లాలో పెరిగాయి. అంతకు మునుపు వారంలో ఆటో ప్రమాదంలో ఎనిమిది వ్యవసాయ కూలీలు మృతి చెందారు. ఈ వారంలో కారు ప్రమాదంలో ముగ్గురు వైద్యులు బలయ్యారు. ఇటువంటి ఘటనలు వరుసగా జరగడం గమనార్హం. రోడ్డు ప్రమాదాలపై ఒకవైపు అవగాహన కార్యక్రమాలను అధికార యంత్రాంగం చేపడుతున్నప్పటికీ ఇవి చోటు చేసుకుంటూనే ఉన్నాయి. రోడ్డు ప్రమాదాల మూలంగా ఏడాదిలో సగటున 300 మందికిపైగా మృత్యువాతపడుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. రోజుకు సగటున ఒకరు చొప్పున ఈ ప్రమాదాల్లో చనిపోతున్నారు. ఇందులో అత్యధిక ప్రమాదాలు చూసినప్పుడు చలికాలంలోనే ఎక్కువగా ఉంటున్నాయి. ప్రధానంగా నవంబర్ నుంచి జనవరి మధ్యకాలంలో ప్రమాదాలు అధికంగా ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయి. దీనికి కారణం మంచు ఉంటోంది. మంచు కారణంగా రహదారి స్పష్టంగా కనిపించగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ వారంలో విడపనకల్లు వద్ద జరిగిన కారు ప్రమాదం కూడా మంచుకారణంగానే జరిగినట్టు పోలీసులు అంచనా వేశారు. ఈ ప్రమాదాలు అనేక మంది జీవితాల్లో తీరని విషాదాన్నే మిగులుస్తున్నాయి. ఈ వారంలో జరిగిన మరో దుర్ఘటన వర్షం కారణంగా కుందుర్పి మండలంలో ఇళ్లు కూలి ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఈఘటనలో మరణించిన వారు భార్యాభర్తలు, కుమార్తె కావడం విచారకరం.

ఈ వారంలోనూ తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రెండు రోజులపాటు ఒక మోస్తరు వర్షపాతం నమోదయింది. వరి, మొక్కజొన్న తదితర పంటలపై ఈ వర్షప్రభావం కొంత వరకు కనిపించింది. నష్టమూ చేకూర్చింది. ఇక ఈ వారంలో హంద్రీనీవా రెండో దశకు

అనంత వీక్షణం

నిధుల కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వమిచ్చిన ఉత్తర్వులు చర్చనీయాంశం అయ్యాయి. ఎందుకంటే మొదటి విడత కాలువ వెడల్పు చేపట్టకుండా రెండో దశ లైనింగ్ ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విపక్షాలు దీన్ని తప్పుబడుతున్నాయి. మొదటి దశ కాలువ వెడల్పును గత ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆరు వేల క్యూసెక్కులతోనే చేపట్టాలని, రెండో దశ లైనింగ్ చేపట్టకూడదని కోరుతున్నారు. లైనింగ్ చేపట్టడం వలన అనంతపురం జిల్లాలో లాభం కంటే నష్టమే అధికమంటున్నారు. ఎందుకంటే కాలువ ద్వారా వెళితే భూగర్భ జలాలు కొంత వరకు పెరిగే అవకాశముందంటున్నారు. దీని వలన ఆయా ప్రాంతాల్లో బోరుబావులపై ఆధారపడి పంటలు సాగు చేసుకునే వారికి ప్రయోజనం ఉంటుందంటున్నారు. ఆధునీకరణ అవసరమైన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు మాత్రం నిధులు కేటాయించకుండా మరమ్మతులకే పరిమితం చేయడాన్ని తప్పుబడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పై నిర్ణయాన్ని పున:సమీక్షించాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

తాడిపత్రి రూరల్ : గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన తాడిపత్రి రూరల్ పరిధిలోని రైల్వేస్టేషన్‌లో శనివారం చోటు చేసుకుంది. ప్రయాణికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం తెల్లవారుజామున తాడిపత్రి రైల్వేస్టేషన్‌లోని 1వ నెంబర్ ప్లాట్‌ఫారంలో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడని తెలిపారు. అయితే వ్యక్తి ముఖంపై గాయాలు కావడంతో ఎవరైనా హత్య చేసి ఇక్కడ పడేశారా..? అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతిచెందిన వ్యక్తి తెల్లచొక్కా, ఎర్రటి పంచ ధరించి ఉన్నాడని, ఎవరైనా సమాచారం తెలిస్తే గుంతకల్లు రైల్వే పోలీసులకు తెలపాలని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు.

మట్కా బీటర్ అరెస్టు

తాడిపత్రి : పట్టనంలో మట్కాబీటర్‌ను అరెస్టు చేసిన రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సాయిప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని నందలపాడు పప్పూరు రోడ్డులో ఉన్న సాయిబాబా గుడి వద్ద గంజాల లక్ష్మయ్య, మట్కా రాస్తుండగా పక్కాగా అందిన సమాచారం మేరకు దాడి చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిందితుడితోపాటు మట్కా పట్టీలు, రూ.లక్ష నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

మూడు గంటల్లో చోరీ కేసు ఛేదింపు

పామిడి : స్థానిక కోగటం ఫంక్షన్ హాల్‌లో జరిగిన పెళ్లిలో పెళ్లికూతురు ఆభరణాల చోరీ కేసును పామిడి పోలీసులు కేవలం మూడు గంటల్లోనే ఛేదించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యుగంధర్ మాట్లాడుతూ మండలంలోని రామరాజుపల్లికి చెందిన ముసలిరెడ్డి గారి విశ్వనాథ్‌రెడ్డి కూతురు వివాహం ఈనెల 5, 6వతేదీల్లో పామిడిలోని కోగటం కళ్యాణ మంటపంలో జరిగింది. వివాహ సమయంలో పెళ్లి కూతురికి సంబంధించిన 38 తులాల రెండు బంగారు వడ్డానాలను పెళ్లి కూతురు గదిలో 5వతేదీ రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. పెళ్లికూతురి తండ్రి విశ్వనాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సిఐ యుగంధర్ కేసు నమోదు చేసి సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఈనేపథ్యంలో పెళ్లి కూతురికి మేకప్ వేసేందుకు వచ్చిన బుటీషియన్ పామిడి బైపాస్ స్పీడ్ బ్రేకర్ల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా సిఐ గమణించి విచారించారు. ఈ విచారణలో పెళ్లికూతురి రెండు వడ్డానాలను తానే చోరీ చేసినట్లు బ్యుటీషియన్ ఒప్పుకుంది. దీంతో రెండు వడ్డానాలను స్వాధీనం చేసుకుని పెళ్లికూతురికి అప్పగించారు.

జక్కలచెరువులో యువకుడిపై దాడి

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామంలో శనివారం రాము అనే యువకుడిపై నాగేంద్ర దాడి చేశాడు. బాధితుడు రాము తెలిపిన వివరాలిలా మేరకు మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన రాము అనే యువకుడు కొత్తపేట గ్రామంలో వద్ద ఉన్న రాయల్టీ చెక్‌పోస్ట్‌లో పని చేస్తున్నాడు. అయితే జక్కలచెరువు గ్రామానికి చెందిన నాగేంద్ర రాయల్టీ చెల్లించకుండా కంకర తోలుకుంటుండగా విధుల్లో ఉన్న రాము ట్రాక్టర్‌ను అడ్డుకుని రాయల్టీ చెల్లించాలని కోరాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వావాదం చోటుచేసుకుని నాగేంద్ర కర్రలతో దాడి చేయడంతో వీపు, నడుము వద్ద గాయాలవడంతో రామును వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : పట్టణ శివార్లలోని గుత్తి-అనంతపురం గ్రామ మలుపు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా మేరకు.. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఓబుళపతి తన బావమరిదిని పెద్దవడుగూరు మండలంలోని విరుపాపురం గ్రామంలో వదిలేందుకు వెళ్లి తిరిగి గుత్తి పట్టణానికి వస్తుండగా గుత్తి-అనంతపురం గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పడిఉన్న అతడిని గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.